# సిల్కు చీరె

శ్రీ నందివాడ కామేశ్వరరావు

★

సంవత్సరాది పండుగ వస్తున్నాదండీ! అన్నది మా శ్రీమతి. అవును – వస్తూంది అన్నా.

"అబ్బా! అది కాదండీ! మొన్నను గళ్లచీరె పూలజాకెట్టు కొనమంటే ఉగాది పండుక్కి కొంటానన్నారుగా" అంటూ ఒక ఓరచూపును నామీద విసరింది. అబ్బ! యెంత హాలాహలాన్నయిన మ్రింగగలం కాని ఆ నల్లని కాటుక కళ్ళనుంచి ప్రసరించే చూపును భరించలేము. తమ అవసరం వున్నప్పుడు మొగవాళ్లతో ముద్దులొలికేటట్లు మాట్లాడటం ఆడవాళ్లందరికీ సహజమే.

"అలాగేలే" అన్నా మౌనంగా!

"ఇవ్వాళ ఆదివారం ఆఫీసుకి శలవు కదండీ సాయంత్రం షాపుకి వెళ్దామా" అంది శ్రీమతి.

ఇక పట్టినపట్టు యెలాగ వదలదని సరేనన్నాను.

మధ్యాహ్నం భోజనాలు అయిన తరువాత ఒకసారి విశ్రాంతి తీసుకుందాము కదా అని పడుకున్నాను. సరిగా నాలుగో గంట అయ్యేటప్పటికి వచ్చి లేపేసింది మా ఇల్లాలు. నేను ముఖం కడుక్కొని కాఫీ త్రాగి బయటకు వచ్చేటప్పటికి, చక్కగా ముస్తాబయి ప్రయాణానికి సిద్ధంగావుంది మా లక్ష్మి. ఆవిడ తొందర కొద్దీ గబగబా బట్టలు వేసుకొని ఆ సందట్లో తల దువ్వుకోవడం మర్చిపోయి గుమ్మందిగిపోతున్నాను.

'అదేమిటండీ! దిలీప్ కుమార్ లాగ! చక్కగా తలదువ్వుకోరాదూ' అన్నాది.

'సరేలేవే' అంటూ లోపలికి వెళ్ళి ఒకమాటు తల దువ్వుకొని వచ్చేను.

ఇద్దరం కలసి బజారుకి బయలుదేరాం. త్రోవలో అమ్మగారి నడకలు చూస్తూవుంటే నా గుండెల్లో దడపుట్టిందంటే నమ్మండి. అవి అంజలీదేవి హంసనడకలుట. అబ్బా! యీకాలం పిల్లలకి యేమన్నా తప్పే. అందులో క్రొత్తగా పెళ్ళిచేసుకున్న పెళ్లాం. విధిలేక అన్నా! "లక్ష్మి! ఒక వారగా నడిస్తే బాగుంటుందేమో?"

'అవునండీ! మీలాటి మొత్తుకుకాళ్ళ నడక నాకు చేతకాదు' అంటూ విసురుగా వెళ్ళిపోతూంది.

నవ్వలేక యేడవలేక ఆమె వెనకాలే నడుస్తూ వెళ్ళేను.

'ఏమండీ! యీ బెంగుళూరు షాపుకి వెళ్దామా' అని అడిగింది!

సరే అన్నాను.

మమ్మల్ని చూడగానే షాపువాడు కాలరు సర్దుకుంటూ, "యేమిటి కావాలి అమ్మగారూ" అంటూ కౌంటరు ముందు నిలబడి అడిగేడు.

'చెట్టంత మొగాడిని ముందు నించుంటే నన్ను అడక్కూడదూ? వెధవలోకం ఆడదంటే పడిచస్తుంది' అని మనస్సులో విసుక్కున్నాను.

'శిల్కు చీరెలు వున్నయిటోయి' అని అడిగింది

'ఓ! వున్నాయమ్మా.' అంటూ నాలుగు కట్టలు ముందు పారేశాడు. 'ఇది బెంగుళూరుసిల్కు, ఇది మైసూరు సిల్కులు యింకా యివి బెనారెస్ ఫైను, సురయా జార్జెట్టు, బినారాంగ్ సిల్కు యేం కావాలో చెప్పండి అమ్మా' అంటూ వున్నాడు.

'యేమండీ! యీ బెనారెస్ ఫైన్ క్వాలిటీ ఎంతో బాగుందికదూ' అంది నా ప్రక్క చూస్తూ.

'సరే! నీ యిష్టం వచ్చింది తీసుకో'! అన్నాను. నామీద నేరం లేకుండాను.

చిన్నగళ్లు, లైట్ కలరు ఎంతో బాగుంది.

'ఓయి! అబ్బాయి! యీ సిల్కు ఆరు గజాలు తియ్యి' అంది.

వాడు ఆరు గజాలు పర్రున చించేసి పొట్లాంకట్టి ఆమె చేతికి అందిచ్చేడు.

ప్రక్కనున్న గుమస్తా బాబూ అంటూ బిల్లు నాచేతికిచ్చేడు.

బిల్లు చూడగానే నా ఒళ్లు జల్లుమంది. గజం యిరవై రూపాయలుట. నూట యిరవై రూపాయిలు వాడికి చెల్లించి మా యిల్లాలితో యిల్లు చేరుకున్నాను.

ఇంటి కొచ్చిన తరువాత తాను కొన్న చీరె అందరికీ చూపిస్తూ పొరిగింటి విశాలాక్షమ్మ దగ్గరకు వెళ్ళింది. ఆమె చీరె యిటు అటూ చూస్తూ 'యేంలక్ష్మీ! యింతా చేసి యిలాటి చీరె కొనుకున్నావు' అని అడిగింది. 'యేమండీ నూటయిరవై రూపాయిలు బెనారెస్ సిల్కు' అంది. 'నీ ముఖం. పచ్చిమోసం. యిది లూధియానాసిల్కు. గజం ఎనిమిది రూపాయలుకన్న యెక్కువ వుండదు' అన్నాది మూతి విరుచుకుంటూను. 'ఆ! దగా చేసేడు గాడిదకొడుకు, యింత సొమ్ము మట్టిపాలె! ఆయనకి తెలిస్తే చంపేస్తారు' అంటూ గోడకి చేరబడిపోయింది మా యిల్లాలు. ఆ రోజునుంచి నన్ను చీరెలు కొనమనలేదంటే నమ్మండి. నేను యేరకం కొంటే ఆరకమే కట్టుకునేది.

---